క్లుప్తంగా

బడిఈడు పిల్లలను బడిలో చేర్చండి



గుడ్లవల్లేరు: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు గురువారం ప్రచారం చేశారు. శేరి కల్వపూడి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పోలిమెట్ల, కూచికాయలపూడిలో ప్రచారం చేశారు. ప్రధానోపాధ్యాయుడు జి.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు బి.స్వర్ణ కుమారి, ఎస్. లక్ష్మీ కుమారి, డి.భూషణం, ఎల్.ఇందిర, వీరాంజనీయులు, బేబి షామిలి ఉన్నారు.

మండవల్లి: ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సర్పంచ్ మెండా ఝాన్సీ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల–1లో ప్రధానోపాధ్యాయుడు పిట్ట ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సురేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ శేషసాయి, శ్యామల, సుధీర్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

గుడివాడ టౌన్: జేసీస్ క్లబ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని రోడ్డు వెంబడి చిరు వ్యాపారులకు ఉచిత గొడుగుల పంపిణీ నిర్వహించారు. వేసవి ఎండ తీవ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో చిరు వ్యాపారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏలూరు రోడ్‌లోని వ్యాపారులకు, జేసీస్‌క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీస్ అధ్యక్షుడు లక్కీ జైన్, పూర్వ అధ్యక్షులు రూప్‌చంద్ జైన్, తాడిపత్రి శ్రీనివాస్, కార్యదర్శి ఎ. స్వామి, టి. హారిక, సాయికిరణ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన రాము అంత్యక్రియలు

గుడివాడరూరల్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన దొండపాడు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గద్దే వెంకట రామాంజనేయులు (రాము), తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక మృతి చెందిన ఆయన అక్క ముక్తినేని అంజలి అంత్యక్రియలు గురువారం సాయంత్రం ముగిశాయి. దొండపాడులోని ఆయన స్వగృహం వద్ద ఉంచిన పార్థివదేహాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక, మాజీమంత్రి పేర్ని వెంకట్రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్‌బాబు, గద్దే బాబూరావు, పార్టీ సీనియర్ నాయకులు ఉప్పాల రాము, దుక్కిపాటి శశిభూషణ్, దండమూడి శేషగిరిరావు (గిరిబాబాయి) తదితరులు రాము, ఆయన అక్కకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గుడివాడ టౌన్: ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజినల్ కార్యదర్శి కేవీ రావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద గురువారం కార్మికులు ధర్నా నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సర్క్యులర్ 1/2019 తక్షణమే అమలు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్షుడు వాసు, కార్యదర్శి డిఎల్ఎల్ మూర్తి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బసవయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో వార్షికోత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరు ప్రాథమిక, కాకరవాడ ప్రాథమికోన్నత పాఠశాలల్లో వార్షికోత్సవాలు గురువారం ఉల్లాసంగా నిర్వహించారు. పెయ్యేరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బేతాళ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయుడు సీహెచ్ చక్రధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు. ఎంతో ఉల్లాసంగా విద్యార్థులు కేరింతలు కొడుతూ ఆటపాటలతో వార్షికోత్సవాన్ని నిర్వహించారు.

వాహనాలు తనిఖీ

పామర్రు: వాహనాలకు సరైన అనుమతులతోనే నడపాలని సీఐ వి సుభాకర్ తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద గురువారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగిసిన శిక్షణ

మొవ్వ: పదో తరగతి వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు సంబంధించిన సర్టిఫికెట్లు గురువారం పంపిణీ చేశారు. ఒకేషనల్ టీచర్ వి.సునీత ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులు మొవ్వ–1 సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ అవనిగడ్డ నాగమహేష్ వద్ద కంప్యూటర్లో మెలకువలు నేర్చుకున్నారు. డిజిటల్ అసిస్టెంట్ కె.ప్రసాద్, వ్యవసాయ శాఖ సహాయకులు పేరం నాగరాజు, వీఆర్వో పి.నాగమల్లేశ్వరి, సచివాలయ సర్వేయర్ షేక్ అబ్దుల్ అలీమ్‌ల శిక్షణ పూర్తి చేసుకున్నారు.

ఈ రోడ్లపై ప్రయాణం నరకయాతనే!

- గుంతలమయంగా మారిన రహదారులు
- కనీసం నడిచేందుకూ వీలు లేని వైనం
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



గోతుల మయంగా మారిన ఉండ్రపూడి రహదారి



అధ్వానంగా ఉన్న పోలవరం వెళ్లే ప్రధాన రహదారి

పామర్రు: మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదార్లు అధ్వానంగా మారటంతో రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. వందల కోట్లతో రహదారులు అభివృద్ధి చేస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రకటనలైతే ఇస్తుంది గానీ గ్రామీణ ప్రాంతాల రహదారులు మాత్రం అభివృద్ధి చేయడం లేదు. కేవలం ప్రకటనలకే పరిమితమైందే తప్ప ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. దీంతో గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణించాలంటే నానా బాధలు పడుతున్నామని అంటున్నారు. మండల పరిధిలోని ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద నుంచి పోలవరం, ఉండ్రపూడి వెళ్లే ప్రధాన రహదారి దారుణంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అల్లాడిపోతున్నారు. సుమారు రెండున్నర కిలోమీటర్ల ఉన్న ఈ రహదారి అంతా గోతుల మయంగా తయారైంది. రహదారిపై ఉన్న రాళ్లు పైకి లేచి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. రహదారిపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో చీకటిలో రహదారి కనబడని పరిస్థితి ఉందని అంటున్నారు. దీంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఈ రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించని కారణంగా కొద్ది కాలానికే పాడైపోయిందని చెబుతున్నారు.

వేలాది మంది రాకపోకలు....

సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారి గుండా ప్రతి రోజూ కనీసం మూడు వేల నుంచి నాలుగు వేల మంది ప్రయాణించి వారి వారి గమ్య స్థానాలకు చేరుకోవాల్సి ఉంటుంది. బైక్‌లు, ఆటోలు, సైకిళ్లపై ప్రయాణించడం కారణంగా వాహనాలు తరచూ పంక్చర్లకు గురవుతున్నాయి. రహదారిపై ప్రయాణించాలంటే భయమేస్తోందని అంటున్నారు. ఆటోలో ప్రయాణిస్తే ఒళ్లు హూనం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి వెంబడి వీధి దీపాలు సక్రమంగా లేకపోవడంతో రాత్రి వేళల్లో చీకటిలో అవస్థలు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి తగు విధమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అవస్థలు పడుతున్నాం



రహదారిపై ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాము. అత్యవసరమైతే ప్రయాణం చాలా కష్టంగా ఉంటోంది. గ్రామంలోని కనీసం 108, 104 వాహనాలు కూడా వచ్చే పరిస్థితి లేదు. అధికారులు స్పందించి రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– వి.అనిల్‌కుమార్, పోలవరం

భయంగా ప్రయాణం



రహదారి అధ్వానంగా మారిన కారణంగా ప్రయాణం భయంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని ఆందోళన కలుగుతోంది. రాత్రి వేళల్లో ప్రయాణం మరీ ఇబ్బందిగా ఉంది. అత్యవసర సమయాల్లో ప్రయాణం చాలా కష్టంగా ఉంటోంది. ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలి.

– పి.సందీప్, ఉండ్రపూడి

సంపద కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడు గ్రామ శివారు రెడ్డిపాలెంలో గురువారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పర్యటించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ చేసే డస్ట్ బిన్‌లను పరిశీలించారు. తొలుత చెత్త సంపద కేంద్ర షెడ్‌ను పరిశీలించి...అక్కడ జరిగే వానపాముల ఎరువు తయారీ విధానంపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీఓ టి.విజయసారథి, ఉప సర్పంచ్ గరికపాటి రాంబాబు, ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు

గుడ్లవల్లేరు: ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఈ నెల 14 నుంచి వచ్చే 10వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ టి.విజయసారథి గురువారం తెలిపారు. గుడ్లవల్లేరు మండలంలో మొత్తం 27 యూనిట్ల లక్ష్యం కేటాయించారని చెప్పారు. అభ్యర్థులందరూ దరఖాస్తును ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. దగ్గరలోని గ్రామ సచివాలయం, మీ– సేవా కేంద్రంలో దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించుకోవాలని తెలిపారు.

ఇండి గ్యాప్ సర్టిఫికెట్‌తో అధిక లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న మహమ్మద్ షరీఫ్ అహ్మద్

పెదసనగల్లు(మొవ్వ): వ్యవసాయ అధికారులు నిర్దేశించిన శాస్త్రీయ పద్ధతుల్లో గ్యాప్–పొలంబడి సాగు సూత్రాలు పాటిస్తూ పండించిన ఉత్పత్తులకు స్కోప్ సర్టిఫికేషన్ వస్తుందని ఆంధ్రప్రదేశ్ సేంద్రియ ద్రవ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ కృష్ణా జిల్లా ప్రాజెక్ట్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ షరీఫ్ అహ్మద్ తెలిపారు. మొవ్వ మండలం పెదసనగల్లు గ్రామంలోని మొవ్వ సాధికారిక ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించే ఇండి గ్యాప్ పొలంబడి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలిచ్చారు. మొవ్వ సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సూరపనేని శ్యామల, మొవ్వ, ఘంటసాల చల్లపల్లి మండల వ్యవసాయ అధికారులు కంచర్ల శివప్రసాద్, కె. మురళీకృష్ణ, జి.సాయి సింధు, మొవ్వ సాధికార ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సీఈవో కె.ప్రవీణ్, ఇంటర్నల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యదేవ్, ఫీల్డ్ ఆఫీసర్ కె.వైవిక తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: ఆరోగ్యకరమైన నాణ్యమైన ఆహార ఉత్పత్తులు ప్రకృతి వ్యవసాయంతో సాధ్యమని రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తే మంచి లాభాలు పొందవచ్చని మండల ఇన్‌చార్జి ఏవో నాగ విజయ అన్నారు. పెరికెగూడెంలో నాగవిజయ ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రకృతి వ్యవసాయ ర్యాలీ గురువారం నిర్వహించారు.

ముదినేపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయంతో భూసారం క్రమేణా పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. మండలంలోని సింగరాయపాలెం రైతుభరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు.

పోషకాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం



ముళ్లపూడిలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఝాన్సీ

పమిడిముక్కల: మండలంలోని ముళ్లపూడి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ 1000 రోజుల పోషణ, పోషణ్ ట్రాకర్ యాప్ రిజిస్ట్రేషన్ గురించి వివరించారు. బలహీన శిశువులు తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ముళ్లపూడి, ఐనంపూడి, వేల్పూరు అంగనవాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

పెదపూడి(మొవ్వ): కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ ద్వారా పౌష్టికాహార లోపాలు ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి ప్రణాళిక ప్రకారం ప్రోటీన్‌లు, న్యూట్రిషీన్‌లతో పాటు అవసరమున్న పౌష్టికాహార పదార్థాలు అందించే చర్యలు చేపడుతున్నట్లు ఏఎన్ఎం బుజ్జి తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–1 బాలింతలు, గర్భిణులు, తల్లులకు పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ నాగమణి, ఎంఎస్ జ్యోతి, జి.పద్మజ, టి. జ్యోతిలక్ష్మి, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

నందివాడ: మండలంలోని పుట్టగుంట గ్రామంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. గుడివాడ ప్రాజెక్ట్ అధికారి విజయ ఫ్లోరెన్స్, సూపర్‌వైజర్ ఎస్. నాగశిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, తేజశ్రీ, రత్నకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జమిదింటకుర్రు(పెదపారుపూడి): తల్లీబిడ్డ ఆరోగ్యం చక్కటి పౌష్టికాహారంపై ఆధారపడి ఉంటుందని వెంట్రప్రగడ సెక్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. శివనాగమణి అన్నారు. గ్రామంలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.

కైకలూరు: గర్భిణులు, బాలింతలకు పోషకాహార విలువలను అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించాలని ఐసీడీఎస్ సీడీపీవో డాక్టర్ ఎన్.దీప్తి చెప్పారు. దానిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార విలువలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎస్.కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.భాగ్యలక్ష్మీ, జి.చిన్నితల్లి పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠకరమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి అన్నారు. మండలంలోని పెనమకూరు, గరికపర్రు, యాకమూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ్‌పై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతి, మహాలక్ష్మి, లక్ష్మి, శివగంగ, లావణ్య, రమా, రాధిక, కనకదుర్గ, విజయలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: క్రీస్తు శిలువ మరణం జయించి పునరుత్థానుడైన సందేశాన్ని సమాజానికి అందజేయడం కోసం నిర్వహించనున్న రన్ ఫర్ జీసస్ జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. ఫుల్ గాస్పెల్ చర్చ్ ఆఫ్ ఇండియా ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడారు. ఈస్టర్ పర్వదినం సందర్భంగా ప్రపంచ శాంతి కోసం ప్రార్థిస్తూ ఈ రన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. శనివారం ఉదయం 5.30 గంటలకు ఏలూరు రోడ్‌లోని ఆర్‌సీఎం చర్చ్ నుంచి బయలుదేరి నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్, బస్టాండ్ మీదుగా ఫుల్ గాస్పెల్ చర్చ్ వరకు సాగుతుందని తెలిపారు. అనంతరం ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ అప్పికట్ల జాషువా, కన్వీనర్ జి. శ్యాంబాబు, పాస్టర్లు కరుణా సాగర్, జిఏ శేఖర్, ఎస్. శామ్యూల్, సునీల్ కుమార్, జి. యెహెజ్కేల్, కరుణ కుమార్, ఎలీషా, నోవహు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయిస్తే ప్రయోజనం

నందివాడ: భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలపై రైతులకు సంబంధిత అధికారులు గురువారం అవగాహన కల్పించారు. జనార్ధనపురం రైతు సేవా కేంద్రం పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.భాను ప్రకాష్ మాట్లాడారు. రసాయన ఎరువులు అవసరమైన మేరకే వాడాలని సూచించారు. రాబోయే రోజుల్లో పంటలు పండాలంటే భూమి ఆరోగ్యాన్ని తెలుసుకొని సరియైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు మట్టి నమూనాలు తీసుకుని పరీక్ష చేయించుకున్న తర్వాత ఏయే ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలుస్తుందన్నారు. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రం లోని గ్రామ వ్యవసాయ సహాయకుల సూచనలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జనార్ధనపురం నీటి సంఘం అధ్యక్షుడు సారిపల్లి ఉమాశంకర్ రెడ్డి , గ్రామ రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



ప్రతిభావంతులైన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ పద్మ, కమిటీ చైర్మన్ స్వప్న తదితరులు

అడ్డాడ(పామర్రు): హైస్కూల్ ప్లస్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యావంతులకు సన్మానం నిర్వహించామని హెచ్‌ఎం డి.పద్మ తెలిపారు. అడ్డాడ జిల్లా పరిషత్ కళాశాల (హైస్కూల్ ప్లస్)లో 2023–25 సీనియర్ ఇంటర్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా సంస్కరణల ఫలితంగా కళాశాల విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయని చెప్పారు. ఈ విద్యా సంస్కరణలు మట్టిలో ఉన్న మాణిక్యాలకు వరంలా మారాయని తెలిపారు. పదో తరగతి అనంతరం చదువు ఆపకూడదనే లక్ష్యంతో ఇంటర్ విద్యను చేరువ చేసేందుకు ప్రతి మండలానికి ఒక ఇంటర్ కళాశాల కాన్సెప్ట్ తీసుకురావటం జరిగిందన్నారు. దీని వలననే ఇంటర్‌లో విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించారని పేర్కొన్నారు. కళాశాలకు చెందిన ఎస్.జ్యోత్స్న ఎంపీసీలో 877/1000 సాధించి ప్రథమ స్థానం సాధించిందని చెప్పారు. బైపీసీలో ఎం.బ్యూలా 824/1000 మార్కులతో ప్రథమ స్థానం పొందిందని పేర్కొన్నారు. వీరిని పాఠశాల విద్యా కుటుంబ సభ్యులు, విద్యా కమిటీ చైర్మన్ స్వప్న, వైస్ చైర్మన్ రాజేష్‌లు అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, హైస్కూల్ ఉపాధ్యాయులు కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మహిళ కుటుంబానికి ఆర్థిక సాయం

ముదినేపల్లి రూరల్: ఉపాధి కూలీ పనులకు వెళ్లి వచ్చిన మహిళ గుండెపోటుతో మరణించిన ఉదంతం పెదపాలపర్రులో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓగిరాల శివపార్వతి (45) గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లి వచ్చిన కొద్దిసేపటికే మృతి చెందింది. గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక వైద్యుడు అంబుల మనోజ్ శివపార్వతి నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తన కుమార్తె, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి తరపున రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ముస్లిం ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం స్థానిక ముబారక్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్, నెహ్రూచౌక్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో నల్ల చట్టాలను రద్దు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసురావడం దుర్మార్గం అన్నారు. లౌకిక విధానాలను దెబ్బతీయడమేనని చెప్పారు. వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టడానికి కేంద్రంలోని పెద్దలు ఈ బిల్లును తీసుకొచ్చి నిర్బంధంగా అమలు చేస్తున్నారన్నారు. దీనిని ముస్లిం ఐక్యవేదిక ఖండిస్తుందని పేర్కొన్నారు. బిల్లును రద్దు చేసేవరకు పోరాడతామని చెప్పారు. ముస్లిం ఐక్యవేదిక చేస్తున్న పోరాటానికి సీపీఎం పూర్తి మద్దతు ఇస్తుందని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. ఐక్యవేదిక ర్యాలీలో సీపీఎం కూడా పాల్గొందన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణ చర్యలను చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



విద్యార్థులకు మంటలు ఆర్పే విధానం నేర్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జుఝువరం(పామర్రు): వేసవిలో అగ్ని ప్రమాదాలను నివారించేలా తగు చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక అధికారి ఎస్. రాంబాబు తెలిపారు. గ్రామంలోని ఉషోదయ హైస్కూల్ విద్యార్థులకు, పామర్రులోని వైట్‌హౌస్ అపార్టుమెంట్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఉషోదయ హైస్కూల్ ప్రిన్సిపల్ రఫీ పాల్గొన్నారు.

కైకలూరు: వంట గదిలో పని పూర్తవగానే గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ కట్టి వేయాలని ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్ చెప్పారు. హోలీక్రాస్ స్కూల్‌లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లు, ఆటోమెటిక్ స్ప్రింక్లర్లను అమర్చుకోవాలని సూచించారు. శ్రీనివాసరావు, రాజేంద్ర, అంజిబాబు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: అగ్నిప్రమాదాలకు గల కారణాలు, వాటి నివారణపై అవగాహన కలిగి ఉండాలని డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ జి. ఆంజనేయులు తెలిపారు. ఫైర్ స్టేషన్‌లో విశ్వభారతి హైస్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిమాపక కేంద్రంలో వినియోగించే వస్తువుల ఉపయోగాలు తెలియజేశారు.

వెంట్రప్రగడ (పెదపారుపూడి): అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో వాటిని ఎలా నివారించాల్లో విద్యార్థులకు అగ్ని మాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుడివాడ అగ్నిమాపక అధికారి ఆంజనేయులు ఇంట్లో గ్యాస్ బండ ద్వారా అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తామయో, వాటిని ఎలా నివారించాలో వివరించారు. ఈకార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వాడుక రేవు ప్రారంభం

మండవల్లి: ఎస్సీ ఏరియాలో వాడుక రేవు–2ను సర్పంచ్ మెండా ఝాన్సీ గురువారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్‌బాబు, వార్డు సభ్యులు గుర్రం విజయలక్ష్మి, బలవరపు సంధ్యారాణి, ఎంపీటీసీ గూడపాటి ఝాన్సీ, మెండ యాకోబు, గోరింక గాంధీ, అభిష, నాగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

హీమోఫీలియా సమస్యను ఆదిలోనే గుర్తించాలి

కైకలూరు: హీమోఫీలియా (రక్తం గడ్డకట్టకపోవడం) సమస్యను ఆదిలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) డాక్టర్లు ప్రసన్న, కీర్తి అన్నారు. ప్రపంచ హీమోఫీలియా దినోత్సవం సందర్భంగా ఏలూరుపాడుకు చెందిన ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో సీహెచ్‌సీ వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ ఇది అరుదుగా వచ్చే వ్యాధి అని చెప్పారు. సకాలంలో ఈ వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే నయమవుతుందని తెలిపారు. జిల్లా దివ్యాంగుల వనరుల కేంద్రం కో–ఆర్డనేటర్ శ్రీనివాసరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గోపవరం వీఆర్వో మధు మృతి

కైకలూరు: అనారోగ్యంతో చికిత్స పొందుతూ గోపవరం వీఆర్వో గుడికందుల మధుసూదనరావు (56) మృతి చెందాడు. గోపవరం, రాచపట్నం వీఆర్వోగా ఆయన విధులు నిర్వహిస్తున్నాడు. కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మూడు రోజులుగా ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ, ఒక మగ సంతానం కలరు. తహసీల్దారు ఎండీ ఇబ్రహీం, ఆర్ఐ వెంకటేశ్వరరావు, సహచర వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది మధు మృతదేహానికి నివాళి అర్పించారు.

వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌లో చేరికలు



అసోసియేషన్‌లో చేరిన మదన్ మోహన్‌తో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

గుడివాడ టౌన్: వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌లోకి నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు గురువారం చేరారు. స్థానిక ఆర్టీసీ డిపోలో జరిగిన వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ చేరికలు జరిగినట్లు అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రయ్య తెలిపారు. ఎన్ఎంయూ కార్యదర్శి మదన్‌మోహన్ తన అనుచరులైన 35 మంది ఆర్టీసీ కార్మికులతో అసోసియేషన్‌లో చేరినట్లు చెప్పారు. కార్మికుల సమస్యలపై పోరాడుతున్న ఎంప్లాయీస్ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు అసోసియేషన్‌లో చేరినట్లు మదన్‌మోహన్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పిఎస్. మూర్తి, ఎ. రాధాకృష్ణ, శ్రీరాములు, దారం ఏడుకొండలు, సీవికే రామారావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్‌కు పార్టీ డిపో కార్యదర్శి బాధ్యతలు అప్పగించినట్లు చంద్రయ్య తెలిపారు.